

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని పరామర్శించిన నాయకులు



మర్రి జనార్దన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

4



చిన్న జిల్లాలు పెద్ద నేరాలు

● పెరిగిన క్రైమ్ రేట్

ఉమ్మడి పాలమూరులో నేరాల సంఖ్య	
దొంగతనాలు	900
హత్యలు	102
రోడ్డుప్రమాద మృతులు	890
ఆత్మహత్యలు	1063
లైంగికదాడులు	359
పోక్సో కేసులు	342
మహిళా నేరాలు	1278
చీటింగ్	637

ఆంధ్రజ్యోతి రౌండప్ 2024

- కీలకమైన నేరాలన్నింట్లో పెరుగుదల
- లైంగికదాడులు, దొంగతనాలు ఆందోళనకరం
- నెత్తుటి దారులుగా రహదారులు
- సైబర్ మోసాలతో ఉక్కిరిబిక్కిరి
- క్షణికావేశంలో బలవన్మరణాలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఉన్నప్పుడు నేరాలు.. ఘోరాలు మితిమీరిపోయిన సందర్భాలు ఉన్నమాట వాస్తవమే.. కానీ చిన్న జిల్లాల ఏర్పాటు తర్వాత కూడా అదే రీతిన క్రైమ్ రేట్ తగ్గకపోవడం గమనార్హం. 2024 సంవత్సరంలో ఉమ్మడి పాలమూరు పరిధిలో గల ఐదు జిల్లాల్లో చోరీలు, హత్యలు, రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, లైంగికదాడులు, మోసాలు పెచ్చుమీరిపోయాయి. వీటి కేసుల సంఖ్యను పరిశీలిస్తే పరిస్థితి ఎలా ఉన్నదో ఇట్టే అర్థమవుతోంది.



జడ్చర్ల డీటీసీ పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహిస్తున్న కొత్త కానిస్టేబుళ్లు(ఫైల్)



జాతీయ రహదారిపై గల పోల్కంపల్లి స్టేజీ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు(ఫైల్)



మల్దకల్‌లో ఆత్మహత్య చేసుకున్న వివాహిత(ఫైల్)

మహబూబ్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పరిపాలనను ప్రజలకు చేరువ చేసి వారికి మెరుగైన సేవలందించేందుకు జిల్లాల విభజన చేశారు.. మండలాలనూ విభజించారు.. చిన్న జిల్లాలుగా ఉంటే జిల్లాలపై కమాండింగ్ పెరిగి నేరాలకు కట్టడి వేయాలనుకున్నారు.. ఇదివరకు ఒక ఎస్పీ కార్యాలయం ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం ఐదు ఎస్పీ కార్యాలయాలతో పాటు కొత్త మండలాలకు పోలీస్‌స్టేషన్లు, సిబ్బందిని నియమించారు.. నేరాలు తగ్గుతాయని భావిస్తున్న తరుణంలో పెరగడం ఆందోళనకు గురిచేస్తున్నది. ఏయేడుకాయేడు తగ్గుతాయనుకున్న నేరాల సంఖ్య చిన్న జిల్లాలలోనే ఎక్కువగా జరుగుతుండటం విచారకరం. ఉమ్మడి జిల్లాలో కీలకమైన నేరాలైన దొంగతనాలు, లైంగికదాడులు, రోడ్డుప్రమాదాలు, ఆత్మహత్యలు గతేడాదితో పోలిస్తే గణనీయంగా పెరగడం గమనార్హం.

కీలకమైన విభాగాలలో నేరాల సంఖ్య పెరగగా, కొన్ని సాధారణ నేరాలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. నారాయణపేట జిల్లాలో నేరాల సంఖ్య గతంలో కన్నా చాలా పెరిగింది. కొన్ని నేరాలలో వందశాతం పెరుగుదల కనిపించింది. మహబూబ్‌నగర్ జిల్లాలోనూ రాబరి, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. సైబర్ నేరాలు ప్రజలను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. చాలా స్టేషన్‌లలో బాధితులకు సరైన న్యాయం జరగడం లేదన్న ఫిర్యాదులున్నాయి. పోలీసులు కొందరు వైట్‌కాలర్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారన్న (మిగతా 4లో..)

పర్యాటకంపై పట్టింపేది?



జూరాల ప్రాజెక్టు ప్రధాన రోడ్డుపై భారీగా నిలిచిన వాహనాలు (ఫైల్)

- జూరాల ప్రాజెక్టు వద్ద పర్యాటకులకు సౌకర్యాలు కరువు
- గేట్లు ఎత్తిన సమయంలో పోటెత్తుతున్న జనం
- కనిపించని హెచ్చరిక బోర్డులు
- ప్రాజెక్టుపై ట్రాఫిక్ సమస్యలు
- పట్టించుకోని అధికారులు
- ప్రమాదాలు జరిగినప్పుడే హడావుడి

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెద్ద ప్రాజెక్టు ప్రియదర్శిని జూరాల. ఈ ప్రాజెక్టు గేట్లు ఎత్తిన సమయంలో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. ప్రాజెక్టుపై సింగిల్ రోడ్డు ఉండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఈ సమయంలో పర్యాటకులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పర్యాటకులు కుటుంబ సభ్యులతో వస్తే సేదతీరేందుకు, భోజనం చేసేందుకు వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోడంతో గతంలో పలుమార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి.

- ధరూరు, ఆంధ్రజ్యోతి

4

పత్తి కొనుగోలు చేయాలి

జడ్చర్ల-కోదాడ రహదారిపై రైతుల రాస్తారోకో



జడ్చర్ల-కోదాడ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

చారకొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం రాస్తారోకో చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని మర్రిపల్లి సమీపంలో జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని తిరుమల కాటన్ మిల్లు వద్ద ఏర్పాటు చేసిన సీసీఐ ద్వారా కొనుగోలు చేయకుండా వారం రోజులుగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ శంషోద్దీన్ సంఘటన స్థలానికి చేరుకొని మార్కెట్ కార్యదర్శి కిరణ్‌తో మాట్లాడి పత్తి కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

ముఖ్యమైన రికార్డులు డిజిటలైజ్ చేయాలి

- ఎస్పీ కార్యాలయాలను తనిఖీ చేసిన ఐజీ రమేష్‌నాయుడు



ఐజీ రమేష్‌నాయుడుకు స్వాగతం పలుకుతున్న నాగర్‌కర్నూల్ ఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం/గద్వాల క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో ఎస్పీ కార్యాలయాలను సోమవారం ఐజీ రమేష్‌నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల ఎస్పీలు గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్, శ్రీనివాసరావులు పూల మొక్కతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అన్ని విభాగాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమైన రికార్డులను డిజిటలైజ్ చేసి భద్రంగా ఉంచాలని గద్వాలలో ఎస్పీ శ్రీనివాసరావుకు సూచించారు. నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు.

విజేత రంగారెడ్డి

- ముగిసిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు
- రన్నర్‌గా నిలిచిన వనపర్తి, నల్గొండ
- మూడో స్థానంలో నల్గొండ, హైదరాబాద్
- విజేతలను అభినందించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి

4

తగ్గేదేలే



- ఉమ్మడి జిల్లాలో రూ.2700 కోట్ల మద్యం విక్రయాలు
- ప్రతీనెల సగటున రూ.225 కోట్ల ఖర్చు
- గతేడాది కన్నా తగ్గిన రూ.100కోట్ల విక్రయాలు
- ఎన్నికల సీజన్ కావడంతో 2023లో పెరిగిన సేల్స్

4

పోలీసుల పహారాలో కేజీబీవీలు



వెలవెలబోతున్న ఉండవల్లి కస్తూర్బా విద్యాలయం

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మె చేస్తుండటంతో కేజీబీవీల వద్ద పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఉద్యోగులు సమ్మెలో ఉన్నందున కేజీబీవీల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక్కో కేజీబీవీ వద్ద ఇద్దరు మహిళా పోలీసులను కాపలా ఉంచారు. వీరు రాత్రి, పగలు భద్రత కల్పిస్తున్నారు.

4 - అయిజ, ఆంధ్రజ్యోతి

జడ్చర్లకు క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు

జడ్చర్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్లకు క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు అయ్యింది. ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు ట్రామా సెంటర్‌తో అత్యవసర వైద్యం అందనుండగా, అన్ని రకాల ఎమర్జెన్సీలకు క్రిటికల్ కేర్ యూనిట్ ద్వారా వైద్యం అందనుంది. క్రిటికల్ కేర యూనిట్‌లో ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులతో పాటు అత్యవసర చికిత్సలు అందనున్నాయి. ఉదాహరణకు గుండెనొప్పి వచ్చిన రోగికి క్రిటికల్ కేర్ యూనిట్‌లో అత్యవసర చికిత్స అందించి, పేషెంట్ స్టేబుల్ అయిన అనంతరం ఐసీయుకు తరలిస్తారు. వెంటిలేటర్ అవసరమైన రోగులకు సైతం అత్యవసర వైద్యం అందించిన అనంతరం ఐసీయుకు తరలిస్తారు. ఇలా ఒక్కో రోగానికి సంబంధించిన ఎమెర్జెన్సీ వైద్యం అందించనున్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.10 కోట్లు మంజూరీ చేసింది. క్రిటికల్ కేర్ యూనిట్‌లో అన్ని విభాగాలకు సంబంధించిన నిష్ణాతులైన వైద్యులు, అనస్థిషియా, ఆర్థోపెడిక్, సర్జన్‌లు, ఫిజీషియన్‌లు అందుబాటులో ఉంటారు. క్రిటికల్ కేర్ యూనిట్‌ను జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసేందుకు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. ఏరియా ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉండటంతో క్రిటికల్ కేర్ యూనిట్‌లో అత్యవసర వైద్యం పొందిన రోగికి వైద్య సేవలు అందనున్నాయి.

క్రిటికల్ కేర్ యూనిట్‌లో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉండనున్నాయి. ఆపరేషన్ థియేటర్, వెంటిలేటర్లు, స్కానింగ్ మిషన్, ఎంఆర్‌ఐ, ఎక్స్‌రే తదితర అత్యాధునిక యంత్రాలు అందుబాటులో ఉండనున్నాయి. ఎమెర్జెన్సీ వైద్యం అందించిన రోగికి తర్వాతటి వైద్యం కోసం ఆసుపత్రికి రెఫర్ చేయనున్నారు. ఎమెర్జెన్సీ వైద్యం కోసం వచ్చే రోగులకు ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం సులువుగా ఉండేలా ఉన్న ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసేందుకు త్వరలోనే ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

గురుకుల విద్యార్థి అదృశ్యం


ఉమేష్‌నాయక్(ఫైల్)

కోయిలకొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పి.ఉమేష్ నాయక్ ఆదివారం సాయంత్రం నుంచి పాఠశాల నుంచి అదృశ్యమైనట్లు ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం క్రీడా మైదానంలోకి వచ్చిన ఉమేష్‌నాయక్ అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయినట్లు తెలిపారు. ఇట్టి విషయాన్ని తల్లిదండ్రులకు వెల్లడించగా అక్కడకు కూడా రాలేదని, బంధువుల ఇంటి దగ్గర ఎక్కడా లేదని కుటుంబ సభ్యులు తెలిపారని ఎస్సై వెల్లడించారు. బాలుడు మిస్సింగ్‌పై గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చిన్న జిల్లాలు.. పెద్ద నేరాలు

(మొదటిపేజీ తరువాయి)

ఫిర్యాదులున్నాయి. డబ్బు, పొలిటికల్, పైరవీలు ఠాణాలను శాసిస్తున్నాయన్న అపవాదు లేకపోలేదు.

● అయినవాళ్లే అంతమొందిస్తున్నారు...

హత్య కేసుల్లో చాలావరకు కుటుంబీకులు, బంధువులు చేస్తున్నవే ఎక్కువగా ఉంటున్నాయి. భార్యాభర్తల మధ్య ఉన్న తగాదాలు, వివాహేతర సంబంధాలతో భార్యను భర్త హత్య చేయడం, లేదంటే భార్యచేతిలో భర్త హత్యకు గురవడం జరుగుతుంది. కొన్ని కక్షసాధింపుతో చేసిన హత్యలున్నాయి. ఈ ఏడాది వీపనగండ్ల మండలం లక్ష్మీపల్లిలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్త శ్రీధర్‌రెడ్డి హత్య సంచలనం సృష్టించింది. పడుకున్నచోటే గొడ్డలితో నరికి దుండగలు హత్య చేసిన ఈ కేసు రాజకీయ దుమారం రేపింది. అధికార పార్టీనే హత్య చేయిందని, బీఆర్ఎస్ ఆరోపించడంతో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంత్యక్రియల్లో పాల్గొనడంతో రాజకీయంగా సంచలనంగా మారడంతో సీఎం రేవంత్‌రెడ్డి హత్యపై స్పందించి దర్యాప్తుకు పోలీసులను ఆదేశించారు. జూన్ 14న ఊట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామంలో భూతగాదాలతో రైతు సంజప్పను దాయాదులు కర్రలతో చితకబాది హత్య చేశారు. సామాజిక మాధ్యమాలలో ఈ దృశ్యాలు వైరల్ కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. జూన్‌లో భూత్పూర్‌లో సీరియల్ కిల్లర్‌ను అరెస్ట్ చేయగా అతను ఆరు కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 102 హత్యలు చోటుచేసుకున్నాయి.

● రక్తపుటేరులు..

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ని రకాల చర్యలు తీసుకుంటున్నా సంఖ్య పెరుగుతూనే ఉంది. అన్ని జి ల్లాల్లో రోడ్డు ప్రమాదాల మృతుల సంఖ్య పెరుగుతుం డటం ఆందోళనకు గురిచేస్తున్నది. రోడ్డు ప్రమాదాల కా రణంగా 890 మంది మరణించగా, 1339 మంది క్షత గాత్రులుగా మారారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతిరో జు ఎక్కడోచోట రహదారులు రక్తపుటేరులుగా మారు తున్నాయి. జిల్లామీదుగా 180 కి.మీ మేర జాతీయ ర హదారి 44 విస్తరించి ఉండటంతో ఈ రహదారిపై ని త్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నా యి. పోలీస్‌శాఖ బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాద ని వారణకు చర్యలు తీసుకుంటున్నా ప్రమాదాలను అరిక ట్టలేకపోతున్నారు. డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపడం, ఓవర్‌లోడ్, నిద్రలేమి, అలసట కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆపో జిట్ డైరెక్షన్‌లో వాహ నాలు నడపడం, గ్రామా ల దగ్గర వాహనాలు ట ర్న్ చేసుకునే సమయంలోనూ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతు న్నాయి.

అమాయకులకు సైబర్ వల

సైబర్ వలలో ఎందరో చిక్కుకుని సర్వం కోల్పోతున్నారు. ఇందులో కొందరు అమాయకులు వారి మాయమాటలకు మోసపోతుండగా, చదువుకున్న వారు కూడా అత్యాశకు పోయి మాయగాళ్లకు చిక్కుతున్నారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతుండటంతో పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే కేసులలో నాలుగోవంతు ఫిర్యాదులు సైబర్‌నేరాలు కావడంతో పోలీస్‌శాఖకు తలనొప్పిగా మారుతోంది. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా నేరాలు మాత్రం ఆగడం లేదు. చివరకు సెల్ ఫోన్‌ల కాలర్‌ట్యూన్ ద్వారా కూడా సైబర్‌నేరాలపై అవగాహన కల్పించాల్సి వస్తోంది.

ఇందులో పోగొట్టుకున్న సొమ్ము పదిశాతం కూడా రికవరి కావడం లేదు. ఒక్క గద్వాల జిల్లాలోనే ఈ ఏడాది రూ.3.83 కోట్లు సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టగా, అందులో రూ.55 లక్షలు ఫ్రీజ్ చేసి, రూ.10 లక్షలు మాత్రమే రికవరీ చేయగలిగారు. ఉమ్మడి జిల్లాలో రూ.15 కోట్ల వరకు సైబర్ నేరగాళ్లు మాయ మాటలతో దోచుకున్నారు.

● అంతకంతకు పెరిగిన దొంగతనాలు

ఇంటికి తాళం వేసి ఊరెళితే దొంగలు అందిన కాడికి దోచుకెళుతున్నారు. అన్ని జిల్లాల్లో దొంగతనాల సంఖ్య పెరిగింది. ఆస్తుల రికవరీ కూడా పూర్‌గా ఉంది. జూలై 7న మక్తల్‌లో తాళం వేసిన ఇంట్లో జరిగిన దొంగతనంలో 66 తులాల బంగారు నగలు అపహరించారు. జాతీయ రహదారి పెబ్బేరు వద్ద ఈనెల 18న తిరుపతి వెళ్లి వస్తున్న ఓ కుటుంబం కారు ఆపుకుని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో దారి దోపిడీ ముఠా వారిని కత్తులతో బెదిరించి గాయపరిచి ఓ మహిళ వద్ద 13 తులాల బంగారునగలు అపహరించారు. జడ్చర్ల బస్టాండ్‌లో జూలై 16న ప్రయాణికుడి బ్యాగ్‌లో నుంచి రూ.36 లక్షల నగదు కాజేశారు.

ఈ కేసును ఛేదించిన పోలీసులు దాదాపు రూ.24 లక్షల వరకు రికవరీ చేశారు. కాగా గతంలో కన్నా చైన్‌స్నాచింగ్ కేసులు చాలా తగ్గాయి.

● 1063 ఆత్మహత్యలు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఒక ఏడాది ఉమ్మడి పాలమూరులో ఆత్మహత్యల కారణంగానే 1063 మంది బలవన్మరణాలు చోటుచేసుకుంటున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదో అర్థమవుతోంది. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే 379, గద్వాలలో 237 మంది బలవన్మరణాలు చేసుకున్నారు. కుటుంబ కలహాలు, మద్యం మత్తు, ప్రేమ వ్యవహారాలు, అప్పుల బాధతో సంసారం సాగక పలువురు బలవన్మరణాలు చేసుకుంటున్నారు. ఇక రైలుకింద పడి ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. కొత్తూర్‌నుంచి కృష్ణా వరకు ఉన్న రైల్వేమార్గం గుండా నిత్యం ఎక్కడో ఒకచోట రైలుపట్టాలకు నెత్తుటి మరకలు అంటుకుంటూనే ఉన్నాయి. ఆత్మహత్యలలో ఈ ఏడాది 140 మంది రైలు కిందపడి చనిపోవడం కలవరపాటుకు గురిచేస్తోంది.


పాసింగ్ ఔట్ పరేడ్‌లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కొత్తకోట శ్రీనివాస్‌రెడి(ఫైల్)

● పోలీస్‌స్టేషన్‌లకు కొత్త కానిస్టేబుళ్లు..

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని పలు జిల్లాలకు కొత్తగా నియమితులైన కానిస్టేబుళ్లను నియమించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు 169 మందిని కే టాయించగా, ఇందులో 48 మంది మహిళలున్నారు. అదే నారాయణపేట జిల్లాకు 78 మందిని కేటా యించారు. ఇందులో 18 మంది మహిళలున్నారు. జడ్చర్ల డీటీసీలో నవంబరు 20న శిక్షణ పొందిన కానిస్టేబుళ్లకు పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి హాజరై శిక్షణ పొందిన కానిస్టేబుళ్లకు సర్టిఫికెట్‌లు జారీ చేశారు.

విజేత రంగారెడ్డి

● ముగిసిన సీఎం కప్ కబడ్డీ పోటీలు

● రన్నర్‌గా నిలిచిన వనపర్తి, నల్గొండ

● విజేతలను అభినందించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. సోమవారం ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో మహిళ, పురుషుల విభాగంలో రంగారెడ్డి జట్టు చాంపియన్ నిలిచింది. పురుషుల విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు వనపర్తిపై 34-31, మహిళల విభాగంలో రంగారెడ్డి జట్టు నల్గొండపై 57-39తో గెలిచి విజేతగా నిలిచింది. పురుషుల విభాగంలో వనపర్తి, మహిళల విభాగంలో నల్గొండ జట్లు రన్నర్‌గా నిలిచాయి. మూడో స్థానంలో పురుష ల విభాగంలో నల్గొండ, మహిళ ల విభాగంలో హైదరాబాద్ జట్టు నిలిచాయి. విజేతలను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు జితేందర్‌రెడ్డి విజేత జట్లను అభినందించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తేవాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. త్వరలో విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. డీవైఎస్‌వో శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్పీ వెంకటేశ్, కురుమూర్తిగౌడ్, బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జాకీర్ అడ్వకేట్, వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య, పాపరాయుడు, జిల్లా క్రీడా శాఖ కార్యాలయ సిబ్బంది రవీందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు పాల్గొన్నారు.


కబడ్డీ రన్నర్‌గా నిలిచిన వనపర్తి బాలుర జట్టుతో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జితేందర్‌రెడ్డి, చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు

తగ్గేదేలే..

మహబూబ్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాలమూరులో ముందునుంచి మద్యం తాగే అలవాటు ఎక్కువే.. చిన్న,పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు మందు తాగడం అలవాటుగా ఉంది.. ఒకప్పుడు కుటుంబ సభ్యులు చాటుమాటుగా తాగేవాళ్లు కూడా ఇప్పుడు అంతా కలిసి కుటుంబ సపరివార సమేతంగా తాగుతున్నారు... అంటే మందుతాగడం ఇదివరకు పెద్ద తప్పుగా చాటుమాటుగా తాగేవాళ్లు ఇప్పుడు అలవాటుగా అది కామన్ అన్నట్లుగా అంతా కలిసి తాగుతున్నారు. అందుకే మద్యం సేల్స్ ప్రతి ఏటా పెరుగుతూనే ఉన్నాయి.

ఇంట్లో ఏ కార్యం జరిగినా మద్యం దిగాల్సిందే.. పండగొచ్చినా, ఆదివారమైనా, మంగళవారమైనా ముక్కతోపాటు మందు పడాల్సిందే అన్నట్లుగా మారడంతో పాటు బర్త్ వేడుకలు చేసినా, పుట్టుచీర కట్టినా రిసెప్షన్, చావుదినాలు అయినా మందు పెట్టడం ఓ స్టేటస్‌గా మారిపోయింది. తినేవాళ్లు తింటుంటే తాగేవాళ్లు తాగుతుంటారు.. ఇలా మద్యం విచ్చలవిడిగా కావడంతో విక్రయాలు జోరందుకుంటున్నాయి. 2023లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్టోబరు, నవంబరు నెలల్లో విపరీతంగా మద్యం విక్రయాలు జరిగాయి. దీంతో గతేడాది రూ.2800 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది ఎన్నికలు లేకపోయినా అదే స్థాయిలో మద్యం విక్రయాలు జరిగాయి. మద్యం దుకాణాలకు గతేడాది డిసెంబరు నుంచి కొత్త పాలసీని అమలు చేశారు. ఈ ఏడాది డిసెంబరు 29 నాటికి 27,64,591 లిక్కర్ కేసులు, 38,88,856 కేసుల బీరు విక్రయాలు జరిగాయి. వీటి ద్వారా రూ.2674 కోట్ల ఖర్చుచేశారు. చివరి రెండ్రోజులు రూ.2700 మార్కును దాటనుంది.


మద్యం నిలువలు

● విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు

ప్రభుత్వానికి వచ్చే ఆదాయ వనరుల్లో ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖలు ప్రధానమైనవి. ఈ ఏడాది రియల్ ఎస్టేట్ కాస్త తగ్గుముఖం పట్టడంతో ఆ ఆదాయాన్ని మద్యం దుకాణాల ద్వారా పెంచుకునేందుకు విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు పెంచుకోవాలని పరోక్షంగా ఎక్సైజ్‌శాఖనే ప్రోత్సహిస్తోంది. అందుకే ఊళ్లో వాడవాడల్లా బెల్ట్‌దుకాణాలు వెలిశాయి. మద్యం పర్మిట్ రూమ్‌లు, దాబాలలో కూడా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి.

మద్యం దుకాణాలు దందా పరోక్షంగా బెల్ట్ దుకాణాలపైనే ఆధారపడి సాగుతుందన్న విషయం బహిరంగ రహస్యమే. మద్యం కోసం రూ.2700 కోట్లు తగలేస్తున్న మందుబాబులు అందులో మంచింగ్‌కోసం మరో వెయ్యికోట్లను ఖర్చుచేస్తోంది. వెరసి జిల్లాలో మద్యం కోసమే జనాలు ఏడాదికి రూ.3700-4000 కోట్లను ఖర్చు చేస్తున్నారు.

పోలీసుల పహారాలో కేజీబీవీలు

కస్తూర్బా విద్యాలయాల వద్ద బందోబస్తు



అయిజ కస్తూర్బా విద్యాలయం ఎదుట విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్

అయిజ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా విద్యాలయాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. హక్కుల సాధన కోసం సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మె చేస్తుండటంతో కేజీబీవీల వద్ద భద్రత ఏర్పాటు చేయాల్సి వచ్చింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో 13 కేజీబీవీలు ఉన్నాయి. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 2,900 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరికి పాఠ్యాంశాలు బోధించేందుకు గతంలో విద్యా శాఖ సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా 144 మంది సీఆర్టీ, పీజీఆర్టీలను నియమించింది. వీరితో పాటు 129 మంది బోధనేతర సిబ్బందిని నియమించింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సిబ్బంది నిరవధిక సమ్మెకు దిగారు. దీంతో కేజీబీవీలలో బోధన నిలిచిపోయింది. భోజన ఏర్పాట్లు, వసతుల కల్పన మాత్రం కొంత మంది నైతిక బాధ్యతగా ఏర్పాటు చేస్తున్నారు. డిసెంబరు 8వ తేదీ నుంచి సమ్మెకు దిగారు. దాదాపుగా 21 రోజులు పూర్తయ్యింది. జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాలు అన్ని పోలీసుల పహారాలో ఉన్నాయి. ప్రతీ కేజీబీవీ వద్ద ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థినుల కోసం కుటుంబ సభ్యులు వచ్చినా పూర్తి స్థాయిలో విచారించి నిర్ణయాలు తీసుకుంటున్నారు.

ముందు జాగ్రత్త చర్యలలో భాగంగానే..

ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె చేస్తున్నందున కేజీబీవీల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా బందోబస్తు ఏర్పాటు చేశాం. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత మాపై ఉంది. విద్యార్థినులకు, కళాశాలకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తాం.

- సత్యనారాయణ, గద్వాల డీఎస్పీ

డిండి నీటి తరలింపుతో పాలమూరుకు నష్టం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 159తో ఏదుల రిజర్వాయర్‌కు గండి కొట్టి డిండి ప్రాజెక్టు ద్వారా నల్గొండ జిల్లాకు నీటిని తరలించుకుపోతే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు తీవ్ర నష్టం జరుగుతుందని మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డిండి నీటిని నల్గొండకు తరలించే ప్రయత్నాన్ని తాము అడ్డుకున్నామని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం డిండి నీటి తరలింపు పనులకు జీవో ఇచ్చిందన్నారు. నల్గొండ జిల్లాకు ఇప్పటికే గోదావరి, మూసి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందుతుందన్నారు. డిండి ప్రాజెక్టు ద్వారా పీఆర్ఎల్ఐ నీటిని తరలించే పనులు ప్రారంభిస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ముందుగా నార్లాపూర్ రిజర్వాయర్ నింపాలని ఆయన డిమాండ్ చేశారు. స్వర్గీయ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ విగ్రహాన్ని తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం హర్షనీయమన్నారు.

తలనీలాల సేకరణకు 3న బహిరంగ వేలం

బిజినేపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలెం గ్రామంలో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలను ఏడాది కాలం పాటు సేకరించేందుకు జనవరి 3న ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సీహెచ్ రంగారావు సోమవారం ప్రకటనలో తెలిపారు. 2025, జనవరి 10 తేదీ నుంచి 2026, జనవరి 9వ తేదీ వరకు తలనీలాలను సేకరించేందుకు నిర్వహించే వేలంలో పాల్గొనదలిచే కాంట్రాక్టర్లు రూ.20 వేల డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. వేలం పాటలో హక్కులు పొందిన కాంట్రాక్టరు వేలం దక్కించు కున్న నాటి నుంచి మూడు రోజుల్లో 50 శాతం, మూడు నెలల్లో మిగతా 50 శాతం చెల్లించాలని నిబంధనలు తెలిపారు. జనవరి 3న దేవాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు వేలం పాట ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు అధిక సంఖ్యలో వేలంలో పాల్గొనాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని

పరామర్శించిన నాయకులు


మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి స్వగృహంలో తన తండ్రి దశదినకర్మ సందర్భంగా నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు

నాగర్‌కర్నూల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి మర్రి జంగిరెడ్డి మృతి చెందారు. సోమవారం దశదినకర్మ నిర్వహించడంతో ఉమ్మడి జిల్లాలో ని పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో ప్రస్తుత ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్యయాదవ్, రాజేందర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీ మధుసూదనచారి, పలువురు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్‌రావు, సురేష్‌రెడ్డి, నాయకులు ఉప్పల వెంకటేశ్, పలువురు ముఖ్య నేతలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి మంత్రి జూపల్లి పరామర్శ


కామినేని ఆసుపత్రిలో చంద్రయ్యయాదవ్‌ను పరామర్శిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నాయ కుడు మేకల చంద్రయ్య యాదవ్‌ను సోమవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. మారెడుమాన్‌దిన్నె గ్రామానికి చెందిన మేకల చంద్రయ్యయాదవ్ గొంతుకు సంబంధించిన సమస్యతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొదుతున్న విషయం తెలుసుకున్న మంత్రి ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. మంత్రి వెంట మాజీ జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరవమ్మ, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మాజీ సర్పంచులు ఉన్నారు.

రూ.9.24 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు, కేసు నమోదు

గద్వాల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) వ్యక్తిగత ఖాతా, క్రెడిట్ కార్డుల నుంచి రూ.9.24లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేసిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి బాధితుడు చెట్టికింది అయ్యపురెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సంగాల గ్రామానికి చెందిన అయ్యపురెడ్డి క్లాస్-1 రైల్వే కాంట్రాక్టర్, కోట్లల్లో బ్యాంకు వ్యవహారాలు నిర్వహిస్తుంటారు. ఆయన ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి ఏపీకే యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. దీని ద్వారా నేరగాళ్లు ఆయన ఖాతా నుంచి గత నెలలోనే రూ.1.70లక్షలను కాజేశారు. ఆ వెంటనే ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారం అయ్యిందని భావించారు. కానీ ఫోన్‌లో యాప్ ఇన్‌స్టాల్ అయిన విషయాన్ని గుర్తించలేకపోయారు. అయ్యపురెడ్డి క్రెడిట్ కార్డుకు డూప్లికేట్ కార్డును తయారు చేసి ఈ నెల 17వ తేదీన రూ. 8.23లక్షలను డ్రా చేసుకున్నారు. మళ్లీ 20వ తేదీన రూ. లక్షను డ్రా చేశారు. డ్రా చేసినట్లు ఖాతాదారుడికి ఎలాంటి మెసేజ్, ఓటీపీలు రాలేదు. కానీ ఈ నెల 26వ తేదీన రూ. 9.24లక్షలు చెల్లించాలని మెయిల్ రావడంతో ఖాతాదారుడు కంగుతిన్నాడు. బ్యాంకుకు వెళ్లి డేటా సేకరించారు. సైబర్ నేరగాళ్ల పని ఉంటుందని 28వ తేదీన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పర్యాటకంపై పట్టింపేది?

- జూరాల ప్రాజెక్టు వద్ద పర్యాటకులకు సౌకర్యాలు కరువు


జూరాల డ్యాం వద్ద ఏర్పాటు చేసిన దుకాణాల్లో చేపల వంటకాల వద్ద పర్యాటకులు(ఫైల్)

ధరూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద పర్యాటకాన్ని పట్టించుకోక పోవడంతో ఇక్కడికి వచ్చే పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 62 గేట్లతో 9టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టు కళకళలాడుతూ ఉంటుంది. కాగా ఇక్కడ దొరికే చేపల వంటకాలు రుచి చూసేందుకు పలు జిల్లాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. సేదతీరేందుకు, భోజనం చేసేందుకు కూడా వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం రూ.16 కోట్ల తో చేపట్టిన పార్కు నేటికీ పూర్తి చేయలేదు. అధికారులు స్పందించి నిర్మాణంలో ఉన్న పార్కును త్వరిత గతిన పూర్తి చేసిన ఉపయోగంలోని తేవాలని పలువురు కోరుతున్నారు.

అంతే కాకుండా జూరాల ప్రాజెక్టు వద్దకు వచ్చే పర్యాటకులకు ఎక్కడ ఏ ప్రమాదం సంభవిస్తుందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోడంతో పర్యా టకులు ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప ప్రమాద హెచ్చరిక బోర్డులపై మాత్రం దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో పలుమార్లు ప్రాజెక్టు వద్ద ఈతకు వెళ్లి మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలి

భారీ వరదలు వచ్చినప్పుడు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు గేట్లను తెరిచిన సమయంలో పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. ప్రాజెక్టుపై సింగిల్ రోడ్డు కావడంతో ప్రాజెక్టు మీద గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని పర్యాటకులు వాపోతున్నారు. ఈ విషయంపై పలుమార్లు పోలీసు అధికారులకు తెలిపినా ఏ మాత్రం పట్టింపులేదని, కనీసం ఇక్కడికి వచ్చే పర్యాటకులకు కారు పార్కింగ్ స్థలం లేకపోవడంతో పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చివరి దశకు పార్కు పనులు

ప్రస్తుతం జూరాల జలాశయం వద్ద పార్కు నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. దీంతో అక్కడ పార్కింగ్ స్థలంతో పాటు హోటల్, రెస్టారెంట్, స్విమ్మింగ్‌పూల్ తరహాలో నిర్మాణాలు చేపడుతున్నాం. త్వరలోనే పర్యాటకులకు అందుబాటులోకి తెస్తాం. అలాగే ట్రాఫిక్ అంతరాయంపై కూడా పోలీసు అధికారులతో మాట్లాడి పకడ్బందీ చర్యలు తీసుకుంటాం.

- వెంకటేష్, ఏఈఈ, జూరాల ప్రాజెక్టు

యాసంగి పంటకు సాగునీరు ఇవ్వాలి

- కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసిన అయిజ మండల ఆర్డీఎస్ రైతులు

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ పరిధిలో యాసంగి పంట పూర్తయ్యేవరకు రైతులకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట అయిజ మండల ఆర్డీఎస్ రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఆర్డీఎస్ పరిధిలోని రైతులు ఇప్పటికే యాసంగి పంటలు సాగుచేసుకున్నారని అన్నారు. రాష్ట్ర గద్వాల జిల్లాలోని జూరాల, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, ఆర్డీఎస్ ప్రాజెక్టుల ద్వారా రైతులకు 2024-25 సంవత్సరం యాసంగి పంట కాలానికి సాగునీరు అందిస్తామని ప్రకటించిందన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు అయిజ మండలంలోని అన్ని గ్రామాలలో వివిధ రకాల పంటకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందివ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతులు చిన్నరాజ్, మద్దిలేటి, శ్రీనివాసులు, రవి, గోపాల కృష్ణ, సామేలు, తిమ్మప్ప, రంగన్న, మల్లికార్జున్, గోవర్ధన్, రాముడు తదితరులు ఉన్నారు.

స్పోర్ట్స్ బాక్స్

నేటి నుంచి రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ టోర్నీ

- పాల్గొననున్న 630 మంది క్రీడాకారులు



నెట్‌బాల్ కోర్టు ఏర్పాటును పరిశీలిస్తున్న క్రీడా శాఖ అధికారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 'సీఎం కప్' క్రీడా పోటీల సందడి కొనసాగుతోంది. రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు మంగళవారం నుంచి, వచ్చేనెల జనవరి రెండవ తేదీ వరకు నిర్వహించనున్నారు.

25 జిల్లాల నుంచి తరలిరానున్న క్రీడాకారులు

సీఎం కప్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ టోర్నీలో రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి 630 మంది క్రీడాకారులు, 100పైగా కోచ్ మేనేజర్లు హాజరు కానున్నారు. పోటీలు ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నాయి. క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల సహకారంతో చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన స్టేడియంలో ఆరు కోర్టులను సిద్ధం చేశారు. క్రీడాకారుల్లో బాలికలకు ఎన్‌టీఆర్ డిగ్రీ కళాశాల, బీపీహెచ్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనం, బాలురకు రెయిన్‌బో స్కూల్, మాడ్రన్ హైస్కూల్, అంబేడ్కర్ భవన్, ఎంవీఎస్ కళాశాలల్లో బస, స్టేడియంలో భోజన వసతి ఏర్పాటు చేశారు.

విజయవంతంగా నిర్వహిస్తాం



గ్రామీణ ప్రాంత యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోంది. ఇప్పటికే అందరి సహకారంతో కబడ్డీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించాం. నెట్‌బాల్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. మొత్తం 630 మంది క్రీడాకారులు టోర్నీలో పాల్గొననున్నారు.

- ఎస్. శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

పోటీలకు పూర్తి సహకరం...



రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల నిర్వహణకు పూర్తి సహకారం అందిస్తున్నాం. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. క్రీడాకారులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన సహాయ సహకారాలను అందిస్తున్నాం.

-ఖాజాఖాన్, రాష్ట్ర నెట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి

సంబురాలకు సై



మహబూబ్‌నగర్ పట్టణంలో విద్యుత్ దీపాల వెలుగులో మెరిసిపోతున్న ఓ బేకరీ

» న్యూ ఇయర్ వేడుకలకు సిద్ధం అవుతున్న ప్రజలు » ఒక్కరోజే రూ.27.90 కోట్ల విలువైన మద్యం దిగుమతి
» డిపోల ముందు మద్యం దుకాణాలు, బార్ల యజమానుల క్యూ » వైన్ షాపులకు అర్ధరాత్రి 12, బార్‌లకు ఒంటి గంట వరకు అనుమతి
» విద్యుత్ దీపాల వెలుగులో మెరిసిపోతున్న బేకరీలు » 31న మధ్యాహ్నం నుంచే ప్రారంభం కానున్న సందడి



పాలమూరులోని ఓ దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న మద్యం

మహబూబ్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాలగతిలో మరో సంవత్సరం కలిసిపోనున్నది. సరికొత్త ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఉమ్మడి పాలమూరు ప్రజలు సిద్ధం అవుతున్నారు. ఈ నెల 31వ తేదీ, మంగళవారం 2024 సంవత్సరానికి ఘనంగా వీడ్కోలు పలికి, నూతన సంవత్సరం 2025కు ఉత్సాహంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మధ్యాహ్నం నుంచే వేడుకల జోరు మొదలు కానున్నది. అందుకోసం ఇప్పటికే స్నేహితులు, కాలేజీ విద్యార్థులు, ఇరుగు పొరుగు ఇళ్ల వారు, అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న వారు దావత్‌లు చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు.

భారీగా మద్యం దిగుమతి

కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా మద్యం విక్రయాలు జోరుగా సాగనున్నాయి. అందుకోసం ఉమ్మడి జిల్లాకు చెందిన వైన్‌షాపులు, బార్ల యజమానులు సోమవారం తిమ్మాజిపేట, కొత్తకోట మద్యం డిపోల వద్ద బారులు తీరారు. ఒక్క రోజే రూ.27.90 కోట్ల విలువైన మద్యాన్ని దిగుమతి చేసుకున్నారు. తిమ్మాజిపేట డిపో నుంచి రూ.17.30 కోట్లు, కొత్తకోట డిపో నుంచి రూ.10.60 కోట్ల విలువైన మద్యాన్ని కొనుగోలు చేశారు. రాత్రి ఎనిమిది గంటల తరువాత కూడా డిపోల వద్ద మద్యం వ్యాపారుల సందడి తగ్గలేదు. భారీగా మద్యం దిగుమతి చేసుకోవడంతో అన్ని దుకాణాలు కళకళలాడుతున్నాయి.

మద్యం దుకాణాల సమయం పెంపు

కొత్త సంవత్సరం వేడుకల నేపథ్యంలో ప్రభుత్వం మద్యం దుకాణాలు, బార్ల సమయాన్ని పొడగించింది. సాధారణ రోజుల్లో రాత్రి 10 గంటల వరకే మద్యం విక్రయాలకు అనుమతి ఉండగా, మంగళవారం రోజు అర్ధరాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచేందుకు అనుమతి ఇచ్చింది. అలానే 11 గంటల వరకు మాత్రమే తెరిచి ఉండే బార్లకు అర్ధరాత్రి ఒంటిగంట వరకు సమయాన్ని పొడిగించింది. మద్యం విక్రయాలతో పాటు మాంసం విక్రయాలు కూడా పెద్ద ఎత్తున సాగనున్నాయి. మటన్, చికెన్ దుకాణాలు కిటకిటలాడనున్నాయి. ఇటీవలే పాలమూరులో ప్రారంభం అయిన కెఎఫ్‌సీతో పాటు, రెస్టారెంట్లు, హోటళ్లలోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం భోజన ప్రియులను ఆకట్టుకునేలా నాన్‌వెజ్ వంటకాలను సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కళకళలాడుతున్న బేకరీలు

కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ డిసెంబర్ 31న అర్ధరాత్రి 12 గంటలకు అందరూ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకుంటారు. ఈ సందర్భంగా బేకరీల్లో కేక్‌ల విక్రయాలు జోరుగా సాగనున్నాయి. అందుకోసం మహబూబ్‌నగర్ పట్టణంలోని బేకరీలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. సోమవారం పెద్ద సంఖ్యలో జనం కేక్‌ల కోసం ఆర్డర్లు ఇచ్చారు. దీంతో బేకరీల యజమానులు అధిక సంఖ్యలో కేక్‌లను సిద్ధం చేస్తున్నారు. కేక్‌ల విక్రయానికి బేకరీల యజమానులు దుకాణాల ముందు ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. జూనియర్ కళాశాలలు, వివిధ విద్యాసంస్థలు, కాలనీలు, అపార్ట్‌మెంట్‌లలో నివసించేవారు కొత్త సంవత్సరం వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు మ్యూజిక్ సిస్టంలను ఏర్పాటు చేసుకుంటున్నారు.



బేకరీలో విక్రయానికి సిద్ధంగా ఉన్న కేకులు

సంతోషంగా వేడుకలు జరుపుకోవాలి

» మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి

కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటుండగా, వేడుకలు శ్రుతి మించకుండా, మందుబాబులను కట్టడి చేసేందుకు పోలీసు శాఖ సిద్ధం అవుతోంది. న్యూ ఇయర్ వేడుకలను జిల్లా ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి సోమవారం ఒక ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చారు. 31 రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. డీజేలపై నిషేధం ఉందని, ఎవరైనా వినియోగిస్తే సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సైలెన్సర్లు తీసి వాహనం నడిపే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వేడుకలు నిర్వహణకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఆంక్షలను అతిక్రమించినా, ఉల్లంఘించినా, ఇబ్బంది కలిగించినా ప్రజలు 100కు లేదా, కమాండ్ కంట్రోల్ రూం ఫోన్ నెంబర్ 8712659630కు కాల్ చేయాలని కోరారు. యువతీ యువకులు తమ కుటుంబసభ్యులతో ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. 2025లో జిల్లా ప్రజలకు అంతా సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖ తరపున జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

క్రైం కార్నర్

పాము కాటుతో యువ రైతు మృతి



శివకుమార్ (ఫైల్)

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసి ఓ రైతు మృతి చెందాడు. ఎస్ఐ వి.సతీశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం, పెద్దకార్పాముల గ్రామానికి చెందిన రైతు నాగపురి శివకుమార్ (28) గ్రామ శివారులోని తన పొలంలో వేరుశనగ పంటకు నీరు పారిస్తుండగా పాము కాటు వేసింది. చుట్టు పక్కల ఉన్నవారు గమనించి వెంటనే 108కు అంబులెన్స్‌లో అతడిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. శివకుమార్‌కు భార్య రాధ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు.

బైక్‌పై నుంచి కింద పడి వ్యక్తి మృతి



గన్నోజు శివకుమార్ (ఫైల్)

తెలకపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ బి.నరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని బండపల్లికి చెందిన గన్నోజు శివకుమార్ (27) ఆదివారం ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి తెలకపల్లి మండల కేంద్రానికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా దానుపల్లి శివారులోని డంపింగ్‌యార్డు వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో అతడి తలకు, ఎడమ భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని అన్న గన్నోజు నరేశ్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.నరేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

» ఊర్కొండ పేట శివారులో ఘటన

ఊర్కొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. కల్వకుర్తి పట్టణంలోని బాల్‌రామ్‌నగర్‌కు చెందిన భాను (20), సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీనాథ్ (18)లు సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఊర్కొండపేట శివారులో, కల్వకుర్తి - జడ్చర్ల ప్రధాన రహదారిపై సూర్యలత కాటన్‌మిల్లు సమీపంలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పి కల్వకుర్తి పట్టణంలోని బాలరామ్‌నగర్‌కు చెందిన భాను (20), సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీనాథ్ (18)లు అక్కడిక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి ఎస్సై వీరబాబు చేరుకొని మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇంట్లో ఒకరు.. పొలంలో మరొకరు ...

» ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న యువతీ యువకులు » ప్రేమ వ్యవహారమే కారణమా?
» నవాబ్‌పేట మండలం కాకర్లపాడ్ గ్రామంలో విషాదఛాయలు



అంకిత, చందుకుమార్ (ఫైల్)

నవాబ్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఎవరూలేని సమయంలో ఒకరు దూలానికి ఉరేసుకొని, మరొకరు గ్రామానికి దూరంలో ఉన్న పంట పొలంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో విషాదం నెలకొన్నది. ఆ ఇద్దరు కూడా గంటల వ్యవధిలో ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రేమ వ్యవహారమే కారణమా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఘటనకు సంబంధించి ఎస్ఐ విక్రం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కాకర్లపాడ్ గ్రామానికి చెందిన చాకలి సుజాత, ఆంజనేయులు దంపతుల కూతురు అంకిత (18) జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఆదివారం అమ్మానాన్నలు కూలి పనులకు వెళ్లి సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చారు. ఇల్లు తెరిచి చూడగా కూతురు అంకిత ఇంటి పైకప్పునకు ఉన్న దూలానికి చీరతో ఉరేసుకొని కనిపించింది. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తమ కూతురి మృతిపై ఎలాంటి అనుమానం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఇదే గ్రామానికి చెందిన రామకొండ చెల్లెలు కుమారుడైన చందుకుమార్ (20) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతూ ఆయన ఇంట్లోనే ఉంటున్నాడు. అదేరోజు రాత్రి 8.30 గంటల ప్రాంతంలో తమ ఇంటిలోని పక్కన గదిలో చదువుకుంటానని వెళ్లాడు. సోమవారం ఉదయం ఇదే గ్రామ సమీపంలో ఉన్న ముర్గని మాదవులు గట్టుపై చెట్టుకు విద్యుత్ తీగతో ఉరేసుకొని కనిపించాడు. ఇది గమనించిన కట్ట చంద్రయ్య అనే వ్యక్తి రామకొండకు సమాచారం ఇచ్చాడు. ఆయన వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. తమ అల్లుడి మరణంపై అనుమానం ఉన్నదంటూ పోలీసులకు రాంకొండ ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒకే రోజు గ్రామంలో ఇద్దరు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రేమ వ్యవహారమే కారణమని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొంత కాలంగా వీరు ప్రేమించుకుంటున్నారని, మనస్పర్థల వల్ల ఆత్మహత్య చేసుకొని ఉంటారని తెలుస్తోంది.

పీడీఎస్‌యూ ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడిగా కందుకూరి పవన్‌కుమార్



పవన్‌కుమార్ (ఫైల్)

వనపర్తి రూరల్, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్‌యూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా కందుకూరి పవన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా కందుకూరి పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సాయి కుమార్, ఉపాధ్యక్షుడిగా తాయన్న, కోశాధికారిగా గణేష్, సభ్యులుగా అశోక్, అనిల్, నారాయణ రెడ్డి, రాజు, రాకేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ ఐదు దశాబ్దాల ఉద్యమ చరిత్ర కలిగిన విప్లవ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికవడం సంతోషంగా ఉందన్నారు. శాస్త్రీయ విద్య సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

» మాజీ ఎంపీ పోతుగంటి రాములు

కల్వకుర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని మాజీ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండల పరిధిలోని గుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. సకాలంలో బస్సులు రాక ఇబ్బంది అవుతోందని కొందరు విద్యార్థులు ఆయన దృష్టికి తెచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

కల్వకుర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం, జకినాల పల్లికి చెందిన కృష్ణయ్యతో పాటు మరో ఆరుగురు ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు. వారిని సోమవారం కల్వకుర్తి కోర్టుకు హాజరు పరిచారు. కృష్ణయ్యకు రెండు రోజుల జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధించారు. మిగిలిన వారికి వంద రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు.

వైభవంగా పాగుంట వెంకన్న కల్యాణం

» అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు
» వేడుకలకు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ఉత్సవ విగ్రహాలతో ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కేటీదొడ్డి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, కేటీదొడ్డి మండలంలోని పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకొని నిర్వహించిన ఈ వేడుకకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉంచారు. అనంతరం అర్చకులు స్వామి, అమ్మవార్లకు కల్యాణ వేడుక జరిపించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు తమ వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హన్వాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని షేక్‌పల్లి గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బత్తుల వెంకటయ్య (56) రెండేళ్ల క్రితం కింద పడగా కాలు విరిగి మంచానికే పరిమితమయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఈనెల 29న ఇంటి వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తిమ్మాయిపల్లి తండాలో మరొకరు..

మూసాపేట డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ రాజేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి తండాకు చెందిన పాత్లావత్ గోపాల్ (55) కొంత కాలంగా టీబీ, పెరాలసిస్‌తో బాధపడుతున్నాడు. దీంతో ఆవేదనకు గురైన ఆయన ఆదివారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా అసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

న్యూస్ బాక్స్

మంద జగన్నాథంను పరామర్శించిన ఎమ్మెల్యే



ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే హైద్రాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీ డాక్టర్ మంద జగన్నాథాన్ని సోమవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పరామర్శించారు. ఆయన ఆరోగ్య సమస్యలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మనోధైర్యాన్ని కోల్పోవద్దని మంద జగన్నాథంకు సూచించారు.

వేరుశనగ పంట పరిశీలన

లింగాల,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాయవరం, క్యాంపురాయవరం గ్రామ శివారులో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటలను సోమవారం వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి భరత్‌కుమార్ పరిశీలించారు. ప్రస్తుతం వేరుశనగా పంటకు తిక్కాకు మచ్చ తెగుళ్ల ఆశిస్తున్నాయని అన్నారు. వీటి నివారణకు వ్యవసాయ శాఖ సూచనల మేరకు పందులను పిచికారి చేసేకోవాలని ఆయన రైతులను సూచించారు. ఏఈఓ వెంట ఆయా గ్రామాల రైతులు రాములు, జగన్, మల్లయ్య, అరుణ ఉన్నారు.

ముందస్తు అవగాహనతోనే వ్యాధుల నివారణ

వంగూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మూగజీవాలకు సీజనల్ వ్యాధుల నివారణకు రైతులకు ముందస్తు అవగాహన అవసరమని మండల పశువైద్య అధికారి డాక్టర్ వెంకటేష్ అన్నారు. సోమవారం మండలంలోని గాజరలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించి, 240 పశువులకు వైద్య పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, రవి, వెంకటయ్య, సైదులు, నాగరాజు,చందు పాల్గొన్నారు.

మృతుడికి నివాళి

కల్వకుర్తి,డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో 18వ వార్డులోని అంబేడ్కర్ కాలనీకి చెందిన జంగయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం జంగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. చైర్మన్ వెంట వైస్ చైర్మన్ షాహెద్, నాయకులు సత్యనారాయణ, బాలరాజు, నారాయణమూర్తి, శేఖర్, నాగార్జున, తరుణ్, గని, నాగరాజు, రాఖీ తదితరులు ఉన్నారు.

'బీసీ రిజర్వేషన్లపై కవిత మాట్లాడటం విడ్డూరం'

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడడం విడ్డూరంగా ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ విమర్శించారు. సోమవారం జిల్లా కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలో బీసీ రిజర్వేషన్లను తగ్గించి బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో చేసిన సమగ్ర కుటుంబ సర్వే పదేళ్లయినా లెక్కలు బయట పెట్టకుండా బీసీలను మోసం చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా కన్వీనర్ అరవింద్‌చారి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు శివ, రాజు, మౌలానా, నవీన్, చైతన్య, మహేష్, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి



కల్వకుర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వాహన చోదకులు నిబంధనలు అతి క్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి హెచ్చరించారు. డిసెంబరు 31న మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదన్నారు. సోమవారం ఎస్ఐ మాధవరెడ్డి మాట్లాడారు. సంవత్సరం ముగింపు రోజు రోడ్లపై యువకులు ర్యాష్ డ్రైవింగ్ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటిస్తూ శాంతిభద్రతల పర్యవేక్షణకు సహకరించాలని కోరారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

'డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి'

కల్వకుర్తి,డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి) : లక్కీ డిప్‌లో తమకు కేటాయించిన ఇళ్లను వెంటనే అప్పగించాలని లబ్ధిదారులు సోమవారం డబుల్‌బెడ్ రూం ఇళ్ల ముందు నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ వంటా వార్పుతో నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఫిబ్రవరిలో ఇళ్లను అప్పగిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పోరాట సంఘం, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

నేర నియంత్రణలో పోలీసుల పాత్ర కీలకం

- మహిళల రక్షణలో షీటీం కీలకంగా వ్యవహరించింది
- డ్రంకెన్ డ్రైవ్‌లో 34మందికి జైలు శిక్ష
- విలేకరుల సమావేశంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నేర నియంత్రణలో జిల్లా పోలీసులు కీలకంగా వ్యవహరించాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. కార్యాలయ సముదాయంలో వార్షిక నేర నియంత్రణపై సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ, దొంగతనాలను అరికట్టడం, మద్యంతాగి వాహనాలు నడిపే వారిపై తీసుకునే చర్యల్లో భాగంగా జిల్లా పోలీసులు కీలకంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలు క్రైమ్ రేటు తగ్గిందని ఆయన పేర్కొన్నారు. ఏడాది కాలంలో వీఐపీలు పీఎం, సీఎంల సభలు సమావేశాలకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంలో జిల్లా పోలీసులు కీలకంగా వ్యవహరించారన్నారు. రోడ్డు ప్రమాదాలు అరికట్టడంలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రిబుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన వారిపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంవత్సర కాలంలో 7,909 ఫిర్యాదులు రావడంతో వాటిపై విచారణ జరిపి 4007 కేసులు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణం ఉండేందుకు 24గంటలు పోలీస్ వ్యవస్థ పని చేసిందన్నారు.

● డ్రగ్స్ నియంత్రణ : డ్రగ్స్ నియంత్రణ కోసం పోలీసులు టీంలుగా ఏర్పడి నిరంతరం తనిఖీలు చేసి చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా డ్రగ్స్ 7 కేసులు నమోదు చేసి 301గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని 12మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

● సైబర్ క్రైమ్ : జిల్లాలో ఏటీఎం, డెబిట్ కార్డు, క్రెడిట్‌కార్డు ఓఎల్ఎక్స్ ఆన్‌లైన్ మోసాలకు గురై 95 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయని ఆయన తెలిపారు. వాటిలో ఐదు కేసులను ఛేదించి బాధితులకు జరిగిన నష్టాన్ని అందించినట్లు తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం జిల్లాలో నిఘా పటిష్టం చేసి నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్న పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

-డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్య లక్ష్మి

అచ్చంపేటటౌన్,డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తేకఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలోని సివిల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం డాక్టర్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, విధులపట్ల నిర్లక్ష్యం వాహించ రాదన్నారు. వంద శాతం లక్ష్య సాధన దిశగా పని చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. గర్భిణులను 12 వారాలలోపే నమోదు చేసుకో వాలని గర్భిణులకు 3, 4 నెలలో వైద్య పరీక్షలు తప్పనిసరిగా గైనకాలజిస్ట్ డాక్టర్‌చే చేయించాలన్నా రు. 102 వాహన సేవలను గర్భిణుల కోసం వినియోగించా లన్నారు. యు విన్ పోర్టల్ వారి టీకీకరుణ స్థాయిని నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు డాక్టర్లు లక్ష్మణ్, రవికుమార్, కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మి

ఘనంగా ధనుర్మాస మహోత్సవం

ఉప్పునుంతల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం త్రిదండి దేవనాథ రామానుజ జియర్ స్వామి పర్యవేక్షణలో ధనుర్మాస మహోత్సవం నిర్వహించారు. ఆలయ గర్భగుడితో పాటు ఆలయ ప్రాంగణం పరిశీలించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, మొగులాల్, రాయల్ రావు, అర్చకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాచండీ హోమం

తిమ్మాజిపేట : మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభువుగా వెలిసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో సోమవారం భక్తిశ్రద్ధలతో మహాచండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు కృష్ణమూర్తి శర్మ, హరిశర్మ, గంగాధర శర్మలు హోమం జరిపించారు. అంతకు ముందు ఆలయంలో లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి శతనామావళి పఠించారు. పలు ప్రాంతాల నుంచి హోమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.



పూజలు చేసిన త్రిదండి దేవనాథ రామానుజ జియర్ స్వామి



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

నల్గొండకు తరలిన సీపీఐ నాయకులు

కందనూలు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నల్గొండ జిల్లాలో సోమవారం జరిగిన బహిరంగ సభకు జిల్లా నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నాగర్ కర్నూల్ నుంచి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ,సీపీఐ మండల కార్యదర్శి మర్యాద వెంకటయ్య ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. నాయకులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఎర్ర జెండా అండగా ఉంటుందని నాయకులు అన్నారు.

● చారకొండ : చారకొండ మండలం నుంచి సీపీఐ రాష్ట్ర నాయకుడు వార్ల వెంకటయ్య, చిలివేరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నల్గొండ సభకు సీపీఐ శ్రేణులు తరలి వెళ్లారు.

● తాడూరు : మండల కేంద్రం నుంచి సీపీఐ రాష్ట్ర నాయకుడు వార్ల వెంకటయ్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వి.వెంకటయ్య, మండల సీపీఐ కార్యదర్శి ఎండి.కుతుబుద్దీన్, ఆధ్వర్యంలో నల్గొండకు బయల్దేరి వెళ్లారు.



నల్గొండ భారీ బహిరంగ సభకు బయల్దేరివెళ్తున్న సీపీఐ నాయకులు

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు వితరణ

లింగాల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ని చెన్నంపల్లి ప్రభుత్వ ప్రాథమి కోన్నత పాఠశాలకు స్వామి వివేకానంద యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో 4సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేశారు. రెండు గదులకు సరిపడ తాత్కాలిక వైరింగ్‌కు కావాల్సిన సామగ్రిని వితరణ చేశారు. పాఠశాలకు సేవాదృకృథంతో ఫ్యాన్లను వితరణ చేయడం హర్షణీ యమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్ కుమా ర్‌తో పాటు ఉపాధ్యాయులు అభినం దిం చారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద యూత్ సభ్యులు భాస్కర్, లింగస్వామి, మల్లేష్, శ్రీశైలం, కే లింగస్వామి, శంకర్, ఉపాధ్యాయులు సాయిజ్యోతి, ఖదీర్‌పాషా, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

మారడుగులో దొంగతనం : కేసు నమోదు

పదర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారడుగు గ్రామంలో సోమవారం 3తులాల బంగారం, రూ.10వేలు దొంగతనానికి గురైందని ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ సద్దాం హుసేన్ తెలిపారు. బాధితుడు ఎండీ రఫీ రోజు పనుల్లో భాగంగా ఇంటి నుంచి బయటకు వెళ్లగా తాళం వేసిన ఇంట్లోకి ఓ వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు బాధితులు తెలుపగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

'లక్ష డప్పుల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలి'

లింగాల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో లక్ష డప్పులు- వెయ్యిగొంతుకల మహా ప్రదర్శన కళాకారుల కవాతును జయప్రదం చేయాలని డప్పు కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు బంగారయ్య కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో లక్ష డప్పులు- వెయ్యిగొంతుకల మహా ప్రదర్శన కళాకారుల కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లింగాలలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల కళాకారుల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం బంగారయ్య, అధ్యక్షుడిగా పతీష్, ప్రధాన కార్యదర్శిగా రామస్వామి, కోశాధికారిగా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా జే బాలేల్లు, చిన్నకాశన్న, ప్రచార కార్యదర్శులుగా నరేందర్, బాలస్వా, బాష, నాగరాజు, వెంకటయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇంచార్జీ లింగస్వామి, జిల్లా అధ్యక్షుడు అల్వాల సుల్తాన్ మాదిగ, ఉపాధ్యక్షుడు భీముడు, జిల్లా కోశాధికారి రాముస్వేరో, తదితరులు పాల్గొన్నారు.

దళిత జీహెచ్‌ఎంపై దాడి చేయడం దుర్మార్గం : కేవీపీఎస్

నాగర్‌కర్నూల్ టౌన్/ అమ్రాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ జడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్న దళిత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కె.రాములుపై మతోన్మాదులు దాడి చేసి అవమానించడం దుర్మార్గమని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బస్టాండు కూడలిలో కేవీపీఎస్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కాశన్న మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాల బోధిస్తున్న క్రమంలో అయ్యప్ప మాల వేసిన ఎనిమిదో తరగతి విద్యార్థికి కాలు తగిలిందనే నెపంతో పదుల సంఖ్యలో మతోన్మాద దుండగులు జీహెచ్‌ఎంపై మూకుమ్మడి దాడి చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపాధ్యాయుడిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వర్ధం పర్వతాలు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అశోక్, నాయకులు సయ్యద్, భాను పాల్గొన్నారు.

● అమ్రాబాద్‌లో అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు జక్క బాలకిష్టయ్య, నాయకులు సామా అనిల్ ఉపాధ్యాయుడిపై దాడి ఘటనను ఖండించారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

నాగర్‌కర్నూల్‌టౌన్/ కల్వకుర్తి/ తాడూరు/ కొల్లాపూర్/ కోడేరు/ పెంట్లవెల్లి/ ఉప్పునుంతల/ వంగూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ పేరును ప్రస్తావిస్తూ పార్లమెంటులో అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రం లోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్ధం పర్వతాలు మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానించిన తీరును బట్టి బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద వైఖరి తెలుస్తోందన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలపై సమరశీల పోరాటాలకు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.శ్రీనివాస్, అశోక్, తారాసింగ్, మధు, యాదయ్య, సత్యనారాయణ, సురేష్, శివరాం పాల్గొన్నారు. ● కల్వకుర్తి అంబేడ్కర్ చౌరస్తాలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు ఆధ్వర్యంలో వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు.● తాడూరు అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అంతటి కాశన్న ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ● కొల్లాపూర్ ఎన్టీఆర్ చౌరస్తాలో సీపీఎం మండల కార్యదర్శి శివ వర్మ మండల కమిటీ సభ్యులు ఎండి సలీం ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు.● కోడేరు బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం మండల కార్యదర్శి పి.నరసింహ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ● పెంట్లవెల్లిలో గ్రంథాలయం ముందు సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.● ఉప్పునుంతలలోని అంబేడ్కర్ విగ్రహం ముందు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగరాజు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ●వంగూరులో సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.



జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణిలో కలెక్టర్ బదావత్ సంతోష్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 26ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కే.సీతారామారావుకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

● చారకొండ : ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సునీత అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. అంతకముందు మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు రెండు నిమిషాలు అధికారులు మౌనం పాటించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరిరెడ్డి, వీఎల్‌వో షేక్ మదార్, హెచ్‌ఈవో నారాయణ దాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే పరిష్కరించాలి : ఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం : పోలీస్ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలు సత్వరమే పరిష్క రించాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశిం చారు. సోమవారం నిర్వహించిన ప్రజావా ణిలో తగు న్యాయం గురించి 3, భూమి పంచాయతీలు 4 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

పేదల ఆరోగ్యానికి కాంగ్రెస్ భరోసా



బాధితునికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల ఆరోగ్యానికి కాంగ్రెస్‌పార్టీ భరోసా కల్పిస్తూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన కాయితి ప్రభాకర్‌రెడ్డికి 48వేలు, నీల లింగమయ్యకు 60వేలు, కనుక హిమబిందులకు 19వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే బాధితులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో ఎంతోమంది నిరుపేదలు వైద్యానికి నోచుకోవడంలేదని, వారికి ప్రభుత్వం ఆసరాగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కృష్ణ, ఆంజనేయులు, అనిల్‌కుమార్, మల్లేష్, సురేష్ ఉన్నారు.

సోషల్ మీడియా పరిచయాలతో మోసపోవొద్దు

- జిల్లా షీటీమ్స్ ఇన్‌చార్జి విజయలక్ష్మి

బిజినేపల్లి,డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్, షేర్‌చాట్, వాట్సాప్, ఇన్ స్ట్రాగామ్ వంటి సోషల్ మీడియా ద్వారా గుర్తు తెలియని వ్యక్తుల పరిచయాలతో మోసపోవద్దని జిల్లా షీటీమ్స్ ఇన్‌చార్జీ విజయ లక్ష్మి హెచ్చరించారు. మండ లంలోని నంది వడ్డెమాన్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మహిళ భద్రత కోసం షీ టీమ్స్ పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలను, బాలికలను ఎవరైనా ఆకతాయిలు అసభ్యకరంగా ప్రవర్తిస్తే షీ టీమ్స్‌కు గాని, స్థానిక పోలీసులకు గాని సమాచారం ఇవ్వాలని, లేదా టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసిన వెంటనే స్పందించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. చదువుకునే వయస్సులో సామాజిక మాధ్యమాలలో పరిచయాలు పెంచుకొని అనవసర సమస్యలు తెచ్చుకోవద్దని, చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత విద్యాభ్యాసంతో బంగారు భవిష్యతుకు బాటలు వేసుకోవాలని అన్నారు. ఆమె వెంట భరోసా ఇన్‌చార్జీ శ్రీలత, హెచ్‌ఎం హనుమంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు చంద్ర మోహన్ రెడ్డి, జయలక్ష్మి, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.



నంది వడ్డెమాన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా షీటీమ్స్ ఇన్‌చార్జి విజయలక్ష్మి

ఎస్ఎస్ఏ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం తదితర పనులను పర్యవేక్షిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ వర్కర్స్ ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని 21 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు కనీస వేతనం పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మహమూద్, పరుశురాం, రామస్వామి, ఎల్లమ్మ, లక్ష్మి, అలివేల పాల్గొన్నారు.

ప్రతిభ పోటీల్లో పాల్గొని విజయం సాధించాలి

- ఎంఈవో సత్యనారాయణశెట్టి

తిమ్మాజిపేట,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ విద్యార్థి పాఠశాలలో నిర్వహించే ప్రతిభా పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ శెట్టి అన్నారు. స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం సాంఘిక శాస్త్ర ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గొరిట, పోతిరెడ్డిపల్లి, ఆవంచ జడ్పీహెచ్ఎస్‌లలో ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో పదవ తరగతి చదివే విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీ సబ్జెక్టుల్లోను మంచి పట్టు సాధించి విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. పది పరీక్షల్లో ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. అంతకు ముందు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు సామ్సన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రసన్నలక్ష్మి, వెంకటస్వామి, మల్లయ్య ఆధ్వర్యంలో ప్రతిభ పోటీల పరీక్షలు నిర్వహించారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్



కలెక్టరేట్‌లో తపస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఉపాధ్యాయులు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నూతన క్యాలెండర్‌ను కలెక్టర్ బదావత్ సంతోష్ ఆవిష్కరించారు. సోమవారం తపస్ జిల్లా అధ్యక్షుడు దెంది రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసి ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వార్షిక పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మనమోని శేఖర్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.